



పెట్టుబడిదారుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

పరిశ్రమలకు అనువైన రాష్ట్రం

- శాన్‌ఫ్రాన్సిస్కో సమావేశంలో సీఎం
- రాష్ట్రానికి రూ.900 కోట్ల పెట్టుబడులు
- స్టాలిన్ సమక్షంలో 6 సంస్థలతో ఒప్పందం

చెన్నై, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలోనే కొత్త పరిశ్రమలకు తమ రాష్ట్రం అనువైనదని ఆర్థికప రంగా ప్రగతిని సాధించిన రాష్ట్రాల్లో రెండోస్థానంలో ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. జాతీయ స్థాయిలో విద్యా సంస్థల్లో 20 శాతం విద్యాసంస్థలు తమ రాష్ట్రంలోనే ఉన్నాయని, ఇలా అన్ని రంగాల్లో ముందంజలో ఉన్న తమ రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు స్థాపిస్తే అన్ని సదుపాయాలు కల్పిస్తామని శాన్‌ఫ్రాన్సిస్కోలో అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సులో సీఎం పేర్కొన్నారు.

అమెరికాలో జరుగుతున్న అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సులో ఆరు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. శాన్‌ఫ్రాన్సిస్కోలో గురువారం రాత్రి ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో జరిగిన ఈ ఒప్పద కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కొత్త పరిశ్రమల స్థాపనకు, ప్రస్తుతమున్న బహుళజాతి సంస్థలకు చెందిన పరిశ్రమల విస్తరణకు తమ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వివరించారు. ఫలితంగా నోకియా, పేపాల్, ఈల్డ్ ఇంజనీరింగ్ సిస్టమ్స్, మైక్రోచిప్ టెక్నాలజీ, ఇన్‌ఫిక్స్ హెల్త్‌కేర్, అప్లయిడ్ మెటీరియల్స్ అనే ఆరు సంస్థలు రూ.900 కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించాయి. ఆ మేరకు స్టాలిన్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో ఆయా సంస్థల ప్రతినిధులు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ పారిశ్రామిక పెట్టుబడుల ద్వారా చెన్నై, కోవై, మదురైలో 4100 మందికి ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. నోకియా సంస్థ రూ.450 కోట్ల పెట్టుబడితో 100 మందికి ఉపాధి కలిగించేలా సిరుచేరి సిప్కాట్‌లో కొత్త పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని నెలకొల్పనుంది. ఈ ఒప్పందంపై నోకియా సంస్థ చీఫ్ స్ట్రాటజీ అండ్ టెక్నాలజీ ఆఫీసర్ నిశాంత్ బాత్రా, ఫిక్స్‌డ్ నెట్‌వర్క్ బిజినెస్ గ్రూపు ప్రెసిడెంట్ శాండీ మేడ్లీ సంతకాలు చేశారు. ఇదే విధంగా ఆన్‌లైన్ నగదు మార్పిడి సేవలందించడంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పేపాల్ హోల్డింగ్స్ రాష్ట్రంలో వంద మందికి ఉపాధి కల్పించేలా ఏఐ టెక్నాలజీతో అత్యాధునిక అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటుచేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో పేపాల్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ శ్రీని వెంకటేశన్, మరో ప్రతినిధి జీ యంగ్ డేవిడ్ సంతకాలు చేశారు. ఇదే విధంగా ఈల్డ్ ఇంజనీరింగ్ సిస్టమ్స్ కోవైలో 300 మందికి ఉపాధి కల్పించేలా రూ.150 కోట్లతో ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రమాకాంత్ అలపతి, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ప్రభాత్ మిశ్రా పాల్గొన్నారు. ఇక మైక్రోచిప్ సంస్థ రాజధాని నగరం చెన్నైలో రూ.250 కోట్లతో 1500 మందికి ఉపాధి కల్పించేలా సెమీకండక్టర్ టెక్నాలజీ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ నెలకొల్పనుంది. ఈ కార్యక్రమంలో మైక్రో చిప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఫేట్రిక్ జాన్సన్, కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ బ్రూస్ వేయర్ తదితరులు పాల్గొన్నారు. ఇదే రీతిలో ఇన్‌ఫింక్స్ హెల్త్‌కేర్ సంస్థ మదురై ఎల్కాట్‌లో రూ.50 కోట్ల పెట్టుబడితో 700 మందికి ఉపాధి కల్పించేలా టెక్నాలజీ అండ్ గ్లోబల్ డెలివరీ సెంటర్ నెలకొల్పేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో సంస్థ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రాధికా టాండన్ పాల్గొన్నారు. ఆ తర్వాత అప్లయిడ్ మెటీరియల్స్ సంస్థ 500 మందికి ఉపాధి కల్పించేలా చెన్నై తరమణిలో సెమీకండక్టర్ల ఉత్పత్తి ఉపకరణాల సాంకేతికాభివృద్ధి కేంద్రాన్ని నెలకొల్పేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో అప్లయిడ్ మెటీరియల్స్ గ్రూపు ఛైర్మన్ డాక్టర్ ప్రభు రాజా, వైస్ ఛైర్మన్ సతీష్ కుప్పురావ్ పాల్గొన్నారు. ఈ ఆరు సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునే కార్యక్రమాల్లో సీఎం స్టాలిన్‌తోపాటు రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీఆర్‌బీ రాజా, పారిశ్రామిక ప్రోత్సాహక వాణిజ్యశాఖ కార్యదర్శి వి. అరుణ్‌రాయ్, పారిశ్రామిక మార్గదర్శక కమిటీ మేనేజింగ్ డైరెక్టర్ వి.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పలు సంస్థలతో అవగాహన ఒప్పందం



ముఖ్యమంత్రికి ఒప్పంద పత్రాన్ని అందజేస్తున్న మైక్రోచిప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఫేట్రిక్ జాన్సన్



కోవై విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన మంకీ ఫీవర్ నిఘా యంత్రాన్ని పరిశీలిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం

రాష్ట్రంలో మంకీ ఫీవర్ నిరోధక చర్యలు

- మంత్రి సుబ్రమణ్యం

చెన్నై, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఐరోపా దేశాల్లో గుర్తించిన మంకీ ఫీవర్ రాష్ట్రంలో వ్యాపించకుండా పటిష్టమైన నిరోధక చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ప్రకటించారు. కోయంబత్తూరులో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శుక్రవారం మంత్రి వెళ్ళారు. అక్కడి విమానాశ్రయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐరోపాలో గుర్తించిన మంకీ ఫీవర్ ప్రస్తుతం 121 దేశాలకు వ్యాపించిందని, ఆ వైరస్ వ్యాపించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ అన్ని దేశాలను హెచ్చరించిందని తెలిపారు. రాష్ట్రంలో విదేశాల నుంచి మంకీ ఫీవర్ వ్యాపించకుండా ఉండేందుకుగాను ముఖ్యమంత్రి స్టాలిన్ సూచనల మేరకు చెన్నై, కోవై, మదురై, తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయాల్లో మంకీ ఫీవర్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అంతేకాకుండా చెన్నై, కోయంబత్తూరు, మదురై, తిరుచ్చి విమానాశ్రయాలలో మంకీఫీవర్ బాధిత విదేశీయుల కోసం ప్రత్యేక వార్డులు కూడా సిద్ధం చేసినట్లు చెప్పారు. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల్లో ఎవరికైనా మంకీ ఫీవర్ ఉన్నట్లు గుర్తిస్తే వారిని ఐసోలేషన్‌లో చికిత్స అందిస్తామన్నారు. విమానాశ్రయాలలో ప్రత్యేక వైద్యసిబ్బంది కూడా అందుబాటులో ఉంటారని చెప్పారు. అంతే కాకుండా విదేశీ ప్రయాణికులకు మంకీ ఫీవర్ పరీక్షలు కూడా జరుపుతున్నట్లు చెప్పారు. ఇక చెన్నై, కోయంబత్తూరు, మదురై, తిరుచ్చి నగరాల్లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రుల్లో తలా 10 పడకల సదుపాయంతో మంకీఫీవర్ బాధితులకు ప్రత్యేక వార్డులు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్యకళాశాలల ఆసుపత్రుల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కొనసాగుతున్నాయని, నిఘా కెమెరాలు కూడా ఏర్పాటు చేశామని మంత్రి సుబ్రమణ్యం తెలిపారు. ఆ తర్వాత ఆయన కోయంబత్తూరులోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసి, రోగులకు అందిస్తున్న వైద్యసేవలను గురించి అడిగి తెలుసుకున్నారు.

స్తంభించిన జనజీవనం

కుమరిలో కుండపోత



వర్షంలోనే పాఠశాలకు వెళ్తున్న బాలికలు

చెన్నై, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కన్నియాకుమారి జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ కుండపోత వర్షం కురిసింది. గురువారం రాత్రి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు మెరుపులు, పెనుగాలులతో కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. శుక్రవారం ఉదయం 7.30 గంటల నుండి గంటసేపు కుండపోతగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతూ వానలో తడుస్తూనే పాఠశాలకు వెళ్లారు. నాగర్‌కోవిల్‌లోని మీనాక్షిపురం రోడ్డు, అశంబురోడ్డు కోట్టార్ రోడ్డు తదితర రహదారుల్లో వర్షపు నీరు వరదలా ప్రవహించింది. తక్కలై, కుళిత్తురై, మార్తాండం, ఇరానియల్, మయిలాడి, కొట్టారం, అంజుగ్రామం, ఆరల్‌వాయ్‌మొళి, ముల్లంగివిళై తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి జోరుగా వర్షం కురిసింది. తిరుపరప్పు జలపాతం పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఆ ప్రాంతం వద్ద చల్లటి వాతావరణం చోటుచేసుకుంది. ఆరోగ్యపురం నుంచి నీరోడి వరకు సముద్రతీర గ్రామాల్లోనూ ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. సముద్రంలో చేపలవేటకు వెళ్ళి జాలర్లంతా వర్షం కారణంగా తిరుగుముఖం పట్టారు.



నాగర్‌కోవిల్‌లో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ షమీమ్ అహ్మద్



చెన్నై, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అహ్మద్‌ను మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ చేయాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం మరోమారు సిఫారసు చేసింది. జస్టిస్ షమీమ్ అహ్మద్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ ఈ నెల 21న సుప్రీం కొలీజియం సిఫారసు చేయగా, ఆ నిర్ణయాన్ని పునస్సమీక్షించాలంటూ జస్టిస్ అహ్మద్ ఈ నెల 22వ తేదీన విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తిని పరిశీలించిన సుప్రీం కొలీజియం.. దానిని తిరస్కరిస్తున్నట్లు ప్రకటించింది. జస్టిస్ షమీమ్ అహ్మద్ బదిలీని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి కూడా సమ్మతించారని, తమ నిర్ణయాన్ని పునస్సమీక్షించాల్సిన అవసరం లేదని పేర్కొంది. కాగా సుప్రీం కొలీజియం నిర్ణయాన్ని పరిశీలించిన కేంద్రం రాష్ట్రపతి ఆమోదానికి పంపాల్సివుంటుంది. అక్కడ ఆమోదం లభించాకే జస్టిస్ షమీమ్ అహ్మద్ బదిలీ వుంటుంది.

పొరుగు రాష్ట్రాలకు తరలుతున్న ఇసుక

- ప్రతిరోజూ 7,500 లారీల అక్రమ రవాణా
- రాష్ట్రంలో మాత్రం కొరత
- కుదేలవుతున్న నిర్మాణ రంగం

పెరంబూర్, ఆగస్టు 30: రాష్ట్రం నుంచి ఇసుక అక్రమంగా పొరుగు రాష్ట్రాలకు తరలిపోతోంది. దీంతో రాష్ట్రంలో ఇసుక కొరత ఏర్పడింది. ఈ కారణంగా తగినంత ఇసుక దొరక్క రాష్ట్రంలో నిర్మాణ రంగం కుదేలవుతోంది. విషయం తెలిసినా ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో రోజుకు 7,500 లారీల ఇసుక పొరుగు రాష్ట్రాలకు తరలిపోతోందనే ఆరోపణలు వినవస్తున్నాయి. గత అన్నాడీఎంకే పాలనలో నిబంధనలు అతిక్రమించి ఇసుక తరలిస్తుండడంతో, భూగర్భ జలమట్టాలు, పర్యావరణానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఫిర్యాదులందడంతో న్యాయస్థానాలు జోక్యం చేసుకున్నాయి. ఆ కారణంగా 'ఎం శాండ్' పరిచయమైంది. అందుకోసం 440 సంస్థలకు అనుమతిచ్చారు. అలాగే, ఎం శాండ్ వినియోగంపై జీవో కూడా విడుదలైంది. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న డీఎంకే అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు తగినన్ని నిధులు లేకపోవడంతో, నదీతీరాల్లో క్వారీలు ప్రారంభించి ఇసుక విక్రయాలు చేపట్టాలని నిర్ణయించింది.

100 ఇసుక క్వారీలు...

ఖనిజవనరులు, జలవనరుల శాఖల ద్వారా 100కు పైగా క్వారీలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. వాటిల్లో 37 క్వారీలకు రాష్ట్ర పర్యావరణ కమిషన్ అనుమతులిచ్చింది. కానీ వాటిల్లో 17 క్వారీలు మాత్రమే ప్రారంభించి ఇసుక విక్రయాలు చేపట్టారు. ఇసుక తవ్వి విక్రయించేందుకు కాంట్రాక్ట్‌సంస్థలకు అప్పగించారు. క్వారీల్లో నిబంధనలు అతిక్రమించి ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని, ఈ కారణంగా రూ.4,730 కోట్లకు పైగా చట్టవ్యతిరేక నగదు మార్పిడి జరిగిందని ఆరోపణలు తలెత్తాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో, ఇసుక కాంట్రాక్టర్లు, జలవనరుల శాఖ అధికారుల ఇళ్లు, కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో, రూ.12.82 కోట్ల నగదు, 1,024 గ్రాముల బంగారం సహా రూ.130 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ గుర్తించి స్తంభింపజేసింది. ఈ అవినీతికి సంబంధించి వేలూరు,



అరియలూరు, కరూర్, తిరుచ్చి, తంజావూరు జిల్లాల కలెక్టర్లను విచారిస్తున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించిన కేసు ప్రస్తుతం విచారణలో ఉంది.

క్వారీల మూసివేత...

ఈడీ దాడుల అనంతరం 17 క్వారీలను మూసివేశారు, 10 క్వారీలు మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో జరుగుతున్న నిర్మాణాలకు రోజుకు 45 వేల లోడ్ల ఇసుక అవసరమవుతోంది. తక్కువ సంఖ్యలో క్వారీలుడడంతో ఇసుక కొరత ఏర్పడుతోంది. ఆంధ్ర రాష్ట్రంలోని స్వర్ణముఖి, పెన్నా, పాలారు నదుల ఇసుక తిరువళ్లూర్, వేలూరు జిల్లాల మీదుగా రాష్ట్రానికి తీసుకొచ్చి, 10 యూనిట్ల ఇసుకను రూ. లక్ష వరకు విక్రయిస్తున్నారు. అక్టోబరు నుంచి ఈశాన్య రుతుపవనాల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఆ లోగా కాంక్రీట్ సహా ఇతర పనులు పూర్తిచేయాల్సి ఉంది. ఇసుక కొరత కారణంగా పలు ప్రభుత్వ నిర్మాణాలూ నిలిచిపోయే పరిస్థితి నెలకొనడం గమనార్హం. ఈ విషయమై నిర్మాణపనుల సంఘం దక్షిణ మండల నిర్వాహకులు ఎస్.రామప్రభు మాట్లాడుతూ.. నిర్మాణ సంస్థలు కూడా ఎం.శాండ్ వినియోగించడం ప్రారంభించాయన్నారు. పైకప్పులు, గోడలు, ప్లాస్టింగ్, కాంక్రీట్ పనులకు నదుల ఇసుక వినియోగించేందుకు అధిక శాతం మంది ఇష్టపడుతుంటారని తెలిపారు. అందువల్ల ఇసుకకు డిమాండ్ బాగా పెరిగిందన్నారు. దీంతో నిర్ణీత కాలంలో నిర్మాణపనులు ముగించేందుకు సాధ్యం కావడం లేదని తెలిపారు.

అక్రమ రవాణా...

రెండేళ్లుగా విస్తారంగా వర్షాలు కురవడంతో పలు నదీతీరాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. దీనిని గుర్తించి ఆయా ప్రాంతాల్లో క్వారీలు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఇసుక, ఎం.శాండ్ లారీ యజమానుల సంఘ సంక్షేమ సంఘం ఆర్గనైజర్ ఆర్.పన్నీర్‌సెల్వం విజ్ఞప్తి చేశారు. క్వారీల నుంచి ఎం.శాండ్ తయారీకోసం వినియోగించే ముడిపదార్థాలు వెలికితీతలో అవినీతి జరుగుతోంది. రసీదులు లేకుండా ఎం.శాండ్ విక్రయించడంతో, జీఎస్‌టీ ఎగవేతకు దారితీస్తోంది. ఎం.శాండ్ తయారీలోనూ నిబంధనలు పాటించకపోవడంతో, వాటి వినియోగంతో చేపట్టే ఇళ్ల నిర్మాణాల్లో పటిష్టత లోపించి ప్రమాదాలు జరిగే అవకాశముంది. అందువల్ల తగిన అనుమతులు లేని ఎం.శాండ్ విక్రయాలు క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక మోతాదులో జరుగుతున్న విక్రయాలు అడ్డుకోవాలని, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పేర్లతో ప్రతిరోజూ సుమారు 7,500 లారీలకు పైగా ఇసుక పొరుగు రాష్ట్రాలకు అక్రమంగా తరలిపోతున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ అక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారించి అడ్డుకట్ట వేస్తే, ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరుతుంది. అదే సమయంలో ప్రజలకు కూడా అవసరమైన ఇసుక లభిస్తుంది.

ఆంధ్ర ఇసుకకు అనుమతులివ్వాలి..

కృష్ణగిరి నుంచి కర్ణాటక రాష్ట్రానికి, కన్నియాకుమారి నుంచి కేరళ రాష్ట్రానికి ఖనిజ సంపద అక్రమంగా తరలిస్తున్నారని రాష్ట్ర ఇసుక లారీల యజమానుల సంఘం అధ్యక్షుడు ఎస్.యువరాజ్ ఆరోపించారు. ఆంధ్ర రాష్ట్రంలోని క్వారీల నుంచి నిబంధనలకు అనుగుణంగా తవ్వుతున్న ఇసుకను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు అనుమతులు ఇవ్వాల్సి వుందని, ఈ విషయమై ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించామని,ఈవిషయం ప్రభుత్వ పరిశీలన లోఉన్నట్లు అధికారులు తెలిపారని యువరాజ్ తెలిపారు.

సమాచార ధ్వని

ఉచిత ఆధ్యాత్మిక పర్యాటనకు ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 30: పురటాసి మాసంలో వైష్ణవాలయాల సందర్శనకు ఉచిత ఆధ్యాత్మిక పర్యటన కోసం వృద్ధులు దరఖాస్తు చేసుకోవాలని హిందూ దేవాదాయ శాఖ తెలిపింది. 60 నుంచి 70 ఏళ్లలోపున్న 1,000 మంది భక్తులను ప్రసిద్ధిగాంచిన వైష్ణవ ఆలయాల సందర్శనకు తీసుకెళ్లనున్నారు. ఈ యాత్రకు అయ్యే ఖర్చు రూ.25 లక్షలను ప్రభుత్వం భరిస్తుంది. సెప్టెంబరు 21,28, అక్టోబరు 5,12 తేదీల్లో ఆయా మండలాల్లో ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభమవుతాయి. చెన్నై మండలంలో ట్రిప్లికేన్ పార్థసారథి, బీసెంట్ నగర్ అష్టలక్ష్మి, తిరువిడందై నిత్యకల్యాణ పెరుమాళ్, మహాబలిపురం శయన పెరుమాళ్, తిరునీర్‌మలై నీర్‌వన్న పెరుమాళ్ ఆలయాలకు సందర్శించవచ్చు. అలాగే, ఒక్కో మండలాల్లో ప్రధాన ఆలయాలను భక్తులు సందర్శించే ఏర్పాట్లు చేశారు. ఆసక్తి ఉన్న భక్తులు www.hrce.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు ఆయా మండల జాయింట్ కమిషనర్ కార్యాలయాలను సంప్రదించవచ్చు.

నర్సింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 30: స్థానిక తండయార్‌పేట అంటువ్యాధుల ఆస్పత్రిలో సహాయ నర్సు శిక్షణకు సెప్టెంబరు 2వ తేది నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై కార్పొరేషన్ తెలిపింది. 2024-25 సంవత్సరంలో రెండేళ్ల సహాయ నర్సు శిక్షణ ప్రారంభం కానుంది. కార్పొరేషన్ ఉద్యోగుల పిల్లలు, కార్పొరేషన్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తారు. అలాగే, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 12వ తరగతి ఉత్తీర్ణులైన వారు 'నెం.185, తిరువొత్తియూర్ హైరోడ్డు, తండయార్‌పేట, చెన్నై-81' చిరునామాలో ఆసుపత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. దరఖాస్తు రుసుము రూ.50 చెల్లించి, దరఖాస్తు పూర్తిచేసి 9వ తేది సాయంత్రం లోపు అదే చిరునామాలో సమర్పించాలి.

రేపు కేటీసీటీ పాఠశాలల శతవార్షికోత్సవాలు

ప్యారీస్, ఆగస్టు 30: శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ) చారిటీస్ నిర్వహణలోని కేటీసీటీ పాఠశాలల శతవార్షికోత్సవాలు ఆదివారం నగరంలో జరుగనున్నాయి. చెట్‌పెట్‌లోని కుచెలాంబాల్ కల్యాణ మండపంలో పాఠశాలల గౌరవ కరస్పాండెంట్ సోలేటి లోకయ్యన్ సుదర్శనం అధ్యక్షతన జరుగనున్న ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా గవర్నర్ ఆర్ఎన్ రవి, ప్రత్యేక అతిథిగా డా.రామజయవంతి పాల్గొంటారని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.అనిల, చుక్కా రేవతిలు తెలియజేశారు.

రేపు పసుమర్తి సుధిక్ష అరంగేట్రం

ప్యారీస్, ఆగస్టు 30: చెన్నై అభినయ నాట్యాలయ విద్యార్థిని పసుమర్తి సుధిక్ష భరతనాట్య అరంగేట్రం ఆదివారం సాయంత్రం చెట్‌పెట్‌లోని చిన్మయ హెరిటేజ్ సెంటర్ తపోవన హాలులో జరుగనుంది. ముఖ్యఅతిథిగా తమిళనాడు ఆర్ట్స్ అండ్ కల్చరల్ డిప్యూటీ డైరెక్టర్ బి.హేమనాథన్ పాల్గొంటారు. కళాక్షేత్ర ఫౌండేషన్ ప్రొఫెసర్ కె.మోహన్, అభినయ నాట్యాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.సుమతి సుందర్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు.

షిర్డీకి మళ్లీ ఇండిగో విమాన సేవలు

ఐసిఎఫ్,ఆగస్టు 30:చెన్నై-షిర్డీ-చెన్నై మార్గంలో డైలీ విమాన సేవలను ఇండిగో సంస్థ పునఃప్రారంభించింది. 2020లో కరోనా కారణంగా ఈ విమాన సేవలు రద్దయ్యాయి. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు సెప్టెంబరు 21 నుంచి సేవలు కొనసాగించేందుకు ఇండిగో సంస్థ నిర్ణయించింది. చెన్నై నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు బయల్దేరే విమానం సాయంత్రం 4.30 గంటలకు షిర్డీ చేరుకుంటుంది. షిర్డీ నుంచి సాయంత్రం 5 గంటలకు బయల్దేరి రాత్రి 7 గంటలకు నగరం చేరుకుంటుందని ఆ సంస్థ అధికారులు తెలిపారు.

రేపు మాస్ ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం

ప్యారీస్,ఆగస్టు30:మద్రాసు ఆదిఆంధ్ర అరుంధతీయ ఆదివాసీ సంక్షేమ సంఘం(మాస్) 32వ ప్రతిభ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం జరుగనుంది. పెరంబూర్‌లోని డీఆర్‌బీసీసీసీ పాఠశాలప్రాంగణంలో సాయంత్రం 4.30గంటలకు మాస్ అధ్యక్షుడు డా.కొల్లి రాజు నేతృత్వంలో ప్రారంభంకానున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్‌కమ్‌టాక్స్ అడిషినల్ కమిషనర్ డా.వి.శ్రీధర్, ప్రత్యేక ఆహ్వానితులుగా ఆస్కా ట్రస్టీ పి.శ్రీనివాస రెడ్డి, పారిశ్రామికవేత్త నర్రావుల వెంకటరమణ, ఆత్మీయ అతిథులుగా రాష్ట్రప్రభుత్వ అదనపు కార్యదర్శి జీసీ నాగూర్,టామ్స్ వ్యవస్థాపకులు డా.గొల్లపల్లి ఇశ్రాయేలు తదితరులు హాజరై, విద్యార్థులకు ఉపకారవేతనం, ప్రతిభ అవార్డులు బహూకరిస్తారని ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి హజరత్తయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

ఈ-సేవా ఉద్యోగుల బదిలీలు

ఐసిఎఫ్, ఆగస్టు 30: ఈ-సేవ ఉద్యోగుల బదిలీలు జరిగాయి. రాష్ట్రప్రభుత్వ కేబుల్ టీవీ సంస్థ ఆధ్వర్యంలో 530 ప్రభుత్వ ఈ-సేవా కేంద్రాలు, 328 శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల ద్వారా 170కి పైగా సేవలు అందుబాటులో ఉన్నాయి. నగరంలో సచివాలయం వంటి కార్యాలయాల్లో సమాచార, సాంకేతిక శాఖ ఆధ్వర్యంలోని ఈ-సేవా కేంద్రాల్లో ఏజెన్సీ సంస్థల ద్వారా తాత్కాలిక ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరి సేవల్లో లోపాలుండడాన్ని ప్రభుత్వం గుర్తించింది. దీంతో ఒకేచోట ఎక్కువ రోజులుగా పనిచేసే 44 మంది ఉద్యోగులను ప్రభుత్వ కేబుల్ టీవీ సంస్థ ఆధ్వర్యంలో పనిచేసే ప్రభుత్వ ఈ-సేవా కేంద్రాలకు బదిలీ చేసింది. వారి స్థానాల్లో ఇతరులు బదిలీ అయ్యారు.

సిప్కాట్ ఆదాయం రూ.5,247 కోట్లు

ఐసిఎఫ్, ఆగస్టు 30: కాంచీపురం జిల్లాలోని ఏడు ఇండస్ట్రియల్ పార్కుల ద్వారా సిప్కాట్ సంస్థకు ఐదేళ్లలో రూ.5,247 కోట్ల ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు. ఈ జిల్లాలో ఇరుంగాట్టుకోట, శ్రీపెరుంబుదూర్, ఒరగడం, పిళ్లైపాక్కం, వల్లం-వడకాల్, మైపూర్-మాతూర్ సహా ఏడు సిప్కాట్ ఇండస్ట్రియల్ పార్కులుండగా, వీటి ఆధ్వర్యంలో 2,000లకు పైగా కర్మాగారా ల్లో 3 లక్షల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఈ కర్మాగారాలు సిప్కాట్ సంస్థకు లీజు, నీటి రుసుము, పర్యవేక్షణ రుసుము, డిపాజిట్ అని 12 రకాల రుసుములు చెల్లిస్తున్నాయి. ఆ ప్రకారం, ఐదేళ్లలో రూ.5,247 కోట్ల ఆదాయం సిప్కాట్ సంస్థకు లభించినట్లు అధికారులు తెలిపారు.

చెన్నై ఎయిర్‌పోర్ట్ నుంచి 18 లక్షల మంది ప్రయాణం

ఐసిఎఫ్, ఆగస్టు 30: చెన్నై ఎయిర్‌పోర్ట్ నుంచి జూలై నెలలో 18 లక్షల మంది ప్రయాణించినట్లు విమానాశ్రయాల కమిషన్ తెలిపింది. దేశంలో ఉన్న విమానాశ్రయాల్లో ప్రయాణించే వారి వివరాలను కమిషన్ విడుదల చేసింది. ఎక్కువ మంది ప్రయాణించిన విమానాశ్రయాల జాబితాలో 18.14 లక్షల మందితో చెన్నై విమానాశ్రయం ఐదో స్థానంలో ఉంది. జూలైలో స్వదేశీ ప్రయాణికులు 13.10 లక్షల మంది, అంతర్జాతీయ ప్రయాణికులు 5.3 లక్షల మంది ప్రయాణించారు. అలాగే, గత ఏడాది జూలైలో 11.8 లక్షల మంది ప్రయాణించినట్లు కమిషన్ తెలిపింది.



స్థానిక గోపాలపురంలో మూపనార్ వర్ధంతి సందర్భంగా అన్నదానం నిర్వహిస్తున్న జీకేఎం అరిమా సంఘం చైర్మెన్ వెంకటేశ్



టి.నగర్‌లోని మూపనార్ సమాధిపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్, బీజేపీ నేత తమిళిసై తదితరులు

మూపనార్‌కు ఘననివాళి

ప్యారీస్, ఆగస్టు 30: తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) వ్యవస్థాపకులు జీకే మూపనార్ 23వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయనకు పలు పార్టీల నేతలు నివాళులర్పించారు. టి.నగర్‌లోని మూపనార్ స్మారక మందిరంలో ఉన్న సమాధిపై బీజేపీ తరఫున తమిళిసై సౌందర్‌రాజన్, టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్, న్యూ జస్టిస్ పార్టీ నేత ఏసీ షణ్ముగం, ఐజేకే అధ్యక్షుడు రవి పచ్చముత్తు, టీఎంసీ నిర్వాహకులు వీవీ జవహర్‌బాబు, జీఆర్ వెంకటేశ్, ఈకే అరుణ్‌కుమార్, బిజూ చాకో తదితరులు నివాళులర్పించారు.

ఫార్ములా-4తో ప్రజలకు ఇబ్బంది ఉండదు

పెరంబూర్, ఆగస్టు 30: ఫార్ములా-4 కార్ రేస్‌తో ప్రజలకు, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదని క్రీడాభివృద్ధి శాఖ కార్యదర్శి అతుల్యమిశ్రా తెలిపారు. ఈ మేరకు ఆయన నగరంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... ఓమందూర్ ప్రభుత్వాస్పత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కారు రేస్ నిర్వహించనున్నామన్నారు. అలాగే, ప్రపంచంలో ఫార్ములా కారు రేస్ నిర్వహించిన 14వ స్థానంలో ప్రస్తుతం చెన్నై చేరిందని ఆయన తెలిపారు.

అయనావరం - ఒట్టేరి మధ్య సొరంగం పూర్తి

అడయార్, ఆగస్టు 30: చెన్నై నగరంలో మెట్రో రైల్ ప్రాజెక్టులో భాగంగా శరవేగంగా నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇందులోభాగంగా అయనావరం - ఒట్టేరి ప్రాంతాల మధ్య సొరంగం తవ్వకాల పనులు పూర్తయ్యాయి. ఈ ప్రాంతాల మధ్య గత 29వ తేదీ సొరంగం తవ్వే పనులు ప్రారంభించగా, మధ్యలో అనేక రకాలైన సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వీటిని సమర్థవంతంగా పరిష్కరించుకూ ఈ సొరంగం నిర్మాణ పనులు పూర్తి చేసినట్టు మెట్రో రైల్ ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. ఈ మార్గాన్ని మెట్రోరైల్ ప్రాజెక్టు డైరెక్టర్ అర్జునన్, అదనపు జనరల్ మేనేజర్ కొల్లి వెంకటరమణ, ప్రాజెక్టు మేనేజర్ అల్బర్ వహీద్, జనరల్ అడ్వైజర్, ప్రముఖ ఇంజనీర్ నాయుడు తదితరులు పరిశీలించారు. చెన్నై మెట్రో రైల్ రెండో దశ పనుల్లో భాగంగా ఈ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

తిరువళ్లూరు - అరక్కోణం మధ్య సబర్బన్ రైళ్ల వేళల్లో మార్పు

ప్యారీస్, ఆగస్టు 30: చెన్నై సెంట్రల్ - అరక్కోణం మార్గంలో అరక్కోణం యార్డులో మరమ్మతుల కారణంగా సెంట్రల్ నుంచి బయలుదేరే 16 రైళ్ల సేవలను మూడు రోజుల పాటు మార్పులు చేసినట్టు దక్షిణ రైల్వే శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. సెంట్రల్ నుంచి శనివారం ఉదయం 8.20, 9.10, 11 గంటలకు నడిపే రైళ్లను తిరువళ్లూరు వరకు మాత్రమే నడుపున్నారు. సెంట్రల్ నుంచి తిరుత్తణికి శనివారం ఉదయం 10, మధ్యాహ్నం 11.45 గంటలకు నడిపే విద్యుత్ సబర్బన్ రైళ్లను తిరువళ్లూరు-తిరుత్తణి మధ్య పాక్షికంగా రద్దు చేశారు. అరక్కోణం-చెన్నై సెంట్రల్‌కు శనివారం నుంచి ఒకటో తేదీ వరకు మధ్యాహ్నం 11, 12, 1.50 గంటల కు బయలుదేరాల్సిన రైళ్ళు అరక్కోణం - తిరువళ్లూరు మధ్య పాక్షికంగా రద్దు చేశారు. తిరుత్తణి - సెంట్రల్‌కు శనివారం, సెప్టెంబరు ఒకటో తేదీల్లో మధ్యాహ్నం 1.20 గంటలకు నడిపే రైళ్ళు తిరుత్తణి-తిరువళ్లూరు మధ్య పాక్షికంగా రద్దు చేశారు. చెన్నై బీచ్ నుంచి తిరుత్తణికి సెప్టెంబరు ఒకటో తేదీ మధ్యాహ్నం 12.10కి బయలుదేరే రైలు తిరువళ్లూరు - తిరుత్తణి మధ్య పాక్షికంగా రద్దు చేశారు. సెంట్రల్ నుంచి అరక్కోణంకు మధ్యాహ్నం 12.40 గంటల రైలు తిరువళ్లూరు వరకు మాత్రమే నడుపుతారు. అరక్కోణంనుంచి చెన్నై సెంట్రల్‌కు మధ్యాహ్నం 3.40గంటలకు నడిపే విద్యుత్ రైలును అరక్కోణం - తిరువళ్లూరు మధ్య పాక్షికంగా రద్దు చేశారు. చెన్నై సెంట్రల్ నుంచి తిరుపతికి సెప్టెంబరు ఒకటో తేదీ బయలుదేరాల్సిన విద్యుత్ రైలును చెన్నై సెంట్రల్ - తిరుత్తణి మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

1,600 ఏళ్లనాటి ఆభరణం లభ్యం



శంఖంతో చేసిన గాజు

ఐసిఎఫ్, ఆగస్టు 30: విరుదునగర్ జిల్లా విజయకరిసల్ కుళంలో 1,600 ఏళ్ల నాటి ఆభరణం లభ్యమైంది. ఇక్కడ జరుగుతున్న మూడో విడత తవ్వకాల్లో వివిధ రకాల వస్తువులు, ప్రాచీన పనిముట్లు, పూర్వీకుల సమాధులు, పురాతన కట్టడ ఆనవాళ్లు కనుగొన్నారు. గురువారం చేపట్టిన తవ్వకాల్లో మహిళలు ధరించే శంఖంతో తయారైన నగిషీ చేసిన గాజు లభించింది. ఈ గాజు 1,600 సంవత్సరాల క్రితం నాటిదని పురావస్తు పరిశోధకులు తెలిపారు.

గ్రూపు-1 ప్రశ్నపత్రం లీకేజీ కేసు...

ఆరు నెలల్లో విచారణ పూర్తి చేయండి

● కింది కోర్టుకు హైకోర్టు ఆదేశం

అడయార్, ఆగస్టు 30: టీఎన్‌పీఎస్సీ ఆధ్వర్యంలో జరిగిన గ్రూపు-1 ప్రశ్నపత్రం లీకేజీ కేసు విచారణను ఆరు నెలల్లో పూర్తి చేయాలని కింది కోర్టుకు మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. 2016 నవంబరు ఒకటో తేదీన గ్రూపు-1 పరీక్ష జరిగింది. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన రామ్‌కుమార్ అనే అభ్యర్థి ప్రశ్నపత్రం మార్చి ఉత్తీర్ణత సాధించినట్టు వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి రామ్ కుమార్ సహా టీఎన్‌పీఎస్సీలో పనిచేసే కొంత మంది ఉద్యోగులను అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ ఏసీబీ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణను రద్దు చేయాలని, ప్రశ్నపత్రం మార్చిడి వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని, రామ్‌కుమార్ వద్ద పనిచేయడంతోనే పోలీసులు తనపై కేసు నమోదు చేశారంటూ కరుణానిధి అనే నిందితుడు కోర్టులో పిటిషన్ వేశారు. దీన్ని విచారణకు స్వీకరించిన హైకోర్టు కేసు విచారణను ఆరు నెలల్లో పూర్చి చేయాలని ఏసీబీ కోర్టును ఆదేశించింది.

రాష్ట్ర బీజేపీకి సమన్వయ కమిటీ

● ఛైర్మన్‌గా హెచ్.రాజా

ప్యారీస్, ఆగస్టు 30: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై లండన్ వెళ్లిన కారణంగా ఆ పార్టీ నిర్వహణకు ఆరుగురితో కూడిన సమన్వయ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ అధ్యక్షుడిగా ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు హెచ్.రాజాను నియమించారు. ఈ మేరకు బీజేపీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించింది. అన్నామలై అంతర్జాయ రాజకీయాలకు సంబంధించి చదువుకునేందుకు లండన్ వెళ్లారు. ఇక, రాష్ట్ర బీజేపీ కార్యాలయ వ్యవహారాలను ప్రిసీడియం ప్రధాన కార్యదర్శి కేశవ వినాయగం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో, కమిటీ చైర్మన్‌గా హెచ్.రాజా, సభ్యులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.చక్రవర్తి, ప్రొఫెసర్ పి.కనకసభాపతి, ప్రధాన కార్యదర్శులు ఎం.మురుగానందం, ప్రొఫెసర్ రామ శ్రీనివాసన్, కోశాధికారి ఎస్సార్ శేఖర్‌లను నియమిస్తూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఉత్తర్వులు జారీచేశారు.

బాధితులకు ప్రత్యామ్నాయం కల్పించాలి

● చిదంబరంలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

పెరంబూర్, ఆగస్టు 30: చిదంబరంలోని జలాశయాలు ఆక్రమించి ఇళ్లు ఏర్పాటుచేసిన వారికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి, పట్టాలు అందజేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. కడలూరు జిల్లా చిదంబరం నగర పరిధిలోని తిల్లయమ్మన్ ఆలయ వీధి, తిల్లయమ్మన్ వాగు, జ్ఞానప్రకాశం కుళిక్కరై, అన్నా వీధి, అంబేడ్కర్ నగర్ తదితర ప్రాంతాల్లో 50 ఏళ్లకు పైగా నివసిస్తున్న ప్రజలు, జలాశయాలు ఆక్రమించి ఇళ్లు నిర్మించారంటూ వాటిని తొలగించేందుకు అధికారులు నోటీసులిచ్చారు. సత్వరం ఇళ్లు ఖాళీ చేస్తే తాము రోడ్డుపై పడతామని, ప్రత్యామ్నాయం చూపిస్తే తాము వెళ్తామని పేర్కొంటూ ఆ ప్రాంతవాసులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. వీరికి మద్దతుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్, పార్టీ నేతలు, కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు. వీరు ఇళ్లు ఖాళీ చేసేందుకు అవకాశం కల్పించాలని బాలకృష్ణన్ డిమాండ్ చేశారు.

థాయ్‌లాండ్ విమానంలో సాంకేతిక లోపం

● 4 గంటలు ఆలస్యం

అడయార్, ఆగస్టు 30: చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి థాయ్‌లాండ్ బయలుదేరాల్సిన విమానంలో ఆఖరి క్షణంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఈ విమానం నాలుగు గంటల పాటు ఆలస్యంగా బయలుదేరి వెళ్లింది. శుక్రవారం వేకువజామున 3.35 గంటలకు చెన్నై నుంచి ఇండిగో విమానం థాయ్‌లాండ్ వెళ్లాల్సి ఉండగా, అందులో సాంకేతికలోపం ఏర్పడినట్టు పైలెట్లు గుర్తించారు. దీంతో విమానం ఎక్కిన ప్రయాణికులను కిందకు దించి వారికి పలు హోటళ్లలో వసతి కల్పించారు. ఆ తర్వాత సాంకేతిక లోపాన్ని ఇంజనీర్లు సరిచేయడంతో విమానం 4 గంటల ఆలస్యంగా బయలుదేరి వెళ్లింది. ఈ సాంకేతిక లోపాన్ని విమానం గాల్లోకి ఎగరకముందే పైలెట్లు గుర్తించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రేపు జనసేన ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

ప్యారీస్, ఆగస్టు 30: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన పురస్కరించుకుని జనసేన పార్టీ చెన్నై విభాగం ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. టి.నగర్‌లోని ఆంధ్రా సోషల్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) ప్రాంగణంలోని గోదావరి హాలులో ఆరోగ్య, రక్తదాన శిబిరం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నిర్మాత ఏ.ఎం.రత్నం ముఖ్య అతిథిగా హాజరు కానుండగా, ఆస్కా అధ్యక్షుడు, పల్లవా గ్రానైట్ అధినేత డాక్టర్ కె.సుబ్బారెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొనున్నారు. వీరితో పాటు స్థానిక జనసేన నేతలు, కార్యకర్తలు కూడా పాల్గొంటారు. ఈ మేరకు ఆ పార్టీ చెన్నై విభాగం సమన్వయకర్త ఏ.తమ్మయ్య నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని సిమ్స్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ రవి పచ్చముత్తు సహకారంతో ఈ మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నామని, ఇందులో సిమ్స్ ఆస్పత్రికి చెందిన నిపుణులైన వైద్య బృందం పాల్గొని పలు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో నగర ప్రజలు పాల్గొని లబ్దిపొందాలని తమ్మయ్య నాయుడు పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పాఠశాలకు పూర్వ విద్యార్థి బస్సు వితరణ



బస్ సర్వీసును జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆషా అజిత్

చెన్నై, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా వెట్రియూరులోని ప్రభుత్వ మహోన్నత పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ మురుగేశన్, ఆయన సతీమణి జయలక్ష్మి కలిసి విద్యార్థుల కోసం రూ. 27లక్షలతో కొత్త బస్ కొనుగోలు చేసి అందజేశారు. ఈ బస్ సర్వీసును జిల్లా కలెక్టర్ ఆషా అజిత్ ప్రారంభించారు. ఆ పాఠశాలలో సుమారు పది గ్రామాలకు చెందిన 184 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా సరైన బస్ సదుపాయం లేకపోవటంతో సకాలంలో పాఠశాలకు చేరుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆ పాఠశాల పూర్వవిద్యార్థి డాక్టర్ మురుగేశన్ కొత్త బస్ కొనుగోలు చేసి అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆషా అజిత్ మాట్లాడుతూ ఆ బస్సును నడిపేందుకు డీజిల్ ఖర్చుతోపాటు డ్రైవర్ వేతనాన్ని కూడా మురుగేశన్ దంపతులు భరించనున్నారని పాఠశాల నిర్వాహకుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు.

నేటినుంచి చెన్నై-నాగర్‌కోయిల్ వందే భారత్

ప్యారీస్, ఆగస్టు 30: చెన్నై-నాగర్‌కోయిల్ మధ్య వందే భారత్ రైలు సేవలను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారు. అంతేకాకుండా, మదురై-బెంగళూరు మధ్య మరో వందే భారత్ రైలు సేవలను కూడా ఆయన ప్రారంభిస్తారు. చెన్నై-నాగర్‌కోయిల్ వందే భారత్ రైల్లో చైర్‌కార్ క్లాసులో రూ.1,650 నుంచి రూ.1,700 వరకు ఛార్జీ వసూలుచేసే అవకాశముంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఐదు వందే భారత్ రైళ్లు నడుపుతుండగా వీటి ప్రజాదరణ బాగా వస్తోంది. చెన్నై సెంట్రల్ నుంచి మైసూరు, కోయంబత్తూర్, విజయవాడ, ఎగ్మూర్ నుంచి తిరునల్వేలి, కోయంబత్తూర్ నగరాలకు ఈ రైళ్లు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో, చెన్నై-నాగర్‌కోయిల్, మదురై-బెంగళూరు మధ్య ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్న కొత్త వందే భారత్ రైళ్ల టైం టేబుల్‌ను దక్షిణ రైల్వే విడుదల చేసింది. 16 బోగీలతో ఉన్న ఈ కొత్త వందే భారత్ రైళ్లలో ఒక ఎగ్జిక్యూటివ్ క్లాస్, మిగిలినవి ఏసీ చైర్ కార్ ఉన్నాయి. చెన్నై ఎగ్మూర్ నుంచి ఉదయం 5 గంటలకు బయల్దేరే రైలు మధ్యాహ్నం 1.50 గంటలకు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నాగర్‌కోయిల్‌లో మధ్యాహ్నం 2.20 గంటలకు బయల్దేరి రాత్రి 11 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది. బుధవారం మినహా ఆరు రోజులు ఈ రైళ్ల సేవలు అందుబాటులో ఉంటాయి. అలాగే, మదురై నుంచి బెంగళూరు మధ్య నడిచే రైలు మదురైలో ఉదయం 5.15 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1 గంటకు బెంగళూరు కంటోన్మెంట్ స్టేషన్‌కు చేరుకుంటుంది. మరుమార్గంలో బెంగళూరు కంటోన్మెంట్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరి రాత్రి 9.54 గంటలకు మదురై చేరుకుంటుంది. ఈ రైళ్లు మంగళవారం మినహా మిగిలిన ఆరు రోజులు నడుపనున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఆగస్టు 20: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

గిండి: గిండి ఎస్టేట్, ఈకాట్టుతాంగల్, గాంధీ నగర్, పూందమల్లి రోడ్డు, జేఎన్ రోడ్డు, అంబాళ్ నగర్, లేబర్ కాలనీ, పిల్లయార్ ఆలయ 1 నుంచి 5 వీధులు, ఏ,బీ,సీ,డీ బ్లాక్‌లు, పూమగల్ వీధి, మౌంట్ రోడ్డు, బాలాజీ నగర్, భారతీయార్ వీధి, ధనకోట రాజా వీధి, అచ్యుతన్ నగర్, మునుస్వామి వీధి

అలందూర్: నేబల్ వీధి, కన్నన్ కాలని, మారీశన్ 5వ వీధి, ఎంజీఆర్ నగర్, ఏఏఐ క్వార్టర్స్ జీఎస్టీ రోడ్డు శాంతి పెట్రోల్ బంక్ సమీపం, కేవీ క్వార్టర్స్ అలందూర్ కోర్టు, ఎంజీఆర్ నగర్, టీచర్స్ కాలనీ.

సెయింట్ థామస్ మౌంట్: పేపర్ రోడ్డు, పూంతోట్టం 2,3 వీధులు, నందంబాక్కం రామాలయం వీధి, బట్ రోడ్డు, బర్మా కాలని, నార్త్ సిల్వర్ వీధి, నజరత్‌పురం, కారయార్ ఆలయ వీధి

వానువంపేట: శాంతి నగర్, సురేందర్ నగర్, కేసరి నగర్, విద్యా నగర్, ముత్తయాళ్ రెడ్డి నగర్, భారతిదాసన్ వీధి, బాలాజీ నగర్, ఉల్లగరం, ఉషా నగర్

క్రోంపేట: రాధా నగర్, కన్నన్ నగర్, నెమిలిచ్చేరి, భారతిపురం, జమ్మంరాయపేట, నాయుడు కడై రోడ్డు, లక్ష్మీ నగర్, జాయ్ నగర్, శాంతి నగర్, గణపతి పురం, రాధా నగర్ మెయిన్ రోడ్డు, గాంధీ నగర్, సుభాష్ నగర్, నటరాజపురం, నెమిలిచ్చేరి రోడ్డు, పెరియార్ నగర్, కురింజినగర్, సెంథిల్ నగర్, నటేశన్ నగర్, తపాల్ నగర్, ఏజీఎస్ కాలని, ఓంశక్తి నగర్, ముత్తుస్వామి నగర్, సోము నగర్, న్యూ కాలనీ, జీఎస్టీ రోడ్డు, సీఎల్‌సీ లైన్, హస్తినాపురం, పురుషోత్తమన్ నగర్, భజన ఆలయ వీధి, జైన్ నగర్, ఎస్బీఐ కాలని, గజలక్ష్మి నగర్, ఎస్ఎస్ఆర్ రోడ్డు

థౌజండ్ లైట్స్: బేగం సాహెబ్ 1 నుంచి 3 వీధులు, కాళియమ్మన్ ఆలయ 1,2 వీధులు, రామస్వామి వీధి, పనకార ఆరోగ్యన్ వీధి, తిరువీధి అమ్మన్ వీధి, బద్రీ రోడ్డు, రంగూన్ వీధి, అన్నాసాలై డోర్ నెం.709 నుంచి 737 వరకు, గ్రీమ్స్ రోడ్డు మురుగేశన్ కాంప్లెక్స్, గ్రీమ్స్ రోడ్డు డోర్ నెం.16 నుంచి 24, 97 నుంచి 126 వరకు, అజీస్‌ముల్క్ 3వ వీధి డోర్ నెం.1 నుంచి 8, 89 నుంచి 96 వరకు, స్పెన్సర్ ప్లాజా

తాంబరం వెస్ట్: న్యూ స్టేట్ బ్యాంక్ కాలనీ, కక్కన్ వీధి, లోకనాథన్ వీధి, సర్వీస్ రోడ్డు ముడిచూర్ బ్రిడ్జి, పటేల్ నగర్, జీఎస్టీ రోడ్డు ఇరుంబులియూర్, మంగళాపురం

పెరుంగళత్తూర్: భారతి నగర్ 1 నుంచి 7 వీధులు, గాంధీ నగర్, కన్నన్ అవెన్యూ, జీఆర్ అవెన్యూ, రాజరాజేశ్వరి నగర్

మాడంబాక్కం: దేనుపురి హౌసింగ్ కాలని, జ్ఞానానంద నగర్, అంజనేయ ఆలయ వీధి, భజన ఆలయ వీధి, అర్పుత ఆలయం వీధి, ఇందిరా నగర్, సంతోషపురం మెయిన్ రోడ్డు

సేలయూర్: మాతా నగర్, లక్ష్మీ నగర్, ఐఏఎఫ్ మెయిన్ రోడ్డు, రిక్కీ గార్డెన్, ఏకేబీ హోమ్స్, ఐశ్వర్య అపార్ట్‌మెంట్స్, సిమేరి సిటీ, శ్రీనివాస నగర్, మహాదేవన్ నగర్

సెంబాక్కం: జయేంద్ర నగర్ మెయిన్ రోడ్డు, కామరాజ్ నగర్, ఈశ్వరి నగర్, పళనియప్ప నగర్, గురవస్వామి నగర్, సోవందరి నగర్

కడపేరి: సుందరం కాలని 1 నుంచి 3 ప్రధాన వీధులు, ఎస్వీ ఆలయ వీధి, వీవీ ఆలయ వీధి, రైల్వే బార్డర్ రోడ్డు, అమర్‌జీవ వీధి, జయ నగర్ మెయిన్ రోడ్డు 1 నుంచి 3 క్రాస్ వీధులు, వేదాంతం కాలని, యావలప్పన్ వీధి, కుప్పుస్వామి వీధి, మాధవన్ వీధి, సుందరమ్మాళ్ నగర్, షర్మిల వీధి, మెట్రోవాటర్ బోర్డు, కుమరన్ వీధి, జీవా వీధి, కామరాజర్ నగర్, అప్పారావు కాలని.

డీఎంకే కూటమిలో విభేదాలు లేవు

● ఎంపీ దురై వైగో

పెరంబూర్, ఆగస్టు 30: డీఎంకే కూటమి పార్టీల్లో ఎలాంటి విభేదాలు లేవని ఎండీఎంకే అధ్యక్షుడు, ఎంపీ దురై వైగో స్పష్టం చేశారు. ఈ మేరకు నగరంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... డీఎంకే మిత్రపక్షాల మధ్య విభేదాలున్నట్లు ఇటీవల వస్తున్న వార్తలు నిరాధారమైనవన్నారు. మత శక్తులను అడ్డుకోవాలని లక్ష్యంతో డీఎంకే నేతృత్వంలో కూటమి ఏర్పాటైందన్నారు. ఈ కూటమి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఘనవిజయం సాధిస్తుందని తెలిపారు.

ఏసీ టిక్కెట్టుతో సాధారణ బస్సులో ప్రయాణం

● రూ.60 వేలు చెల్లించాలని ఉత్తర్వులు

పెరంబూర్, ఆగస్టు 30: ఏసీ టిక్కెట్టు కొంటే సాధారణ బస్సులో ప్రయాణింపజేసిన వృద్ధుడికి ప్రభుత్వ రవాణా సంస్థ రూ.60,000 పరిహారం చెల్లించాలని తిరునల్వేలి వినియోగదారుల ఫోరం ఉత్తర్వులు జారీచేసింది. తిరునల్వేలి పాళయంకోట కొత్త బస్టాండ్ ప్రాంతానికి చెందిన షణ్ముగవేల్ (64) గత ఏడాది ఆగస్టు 27న రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన బస్సులో తిరునల్వేలి నుంచి తూత్తుకుడికి ఏసీ బస్సులో టిక్కెట్టు తీసుకొని ప్రయాణించాడు. వాగైకుళం ప్రాంతంలో ఏసీ బస్సు మరమ్మతులకు గురికావడంతో, ఆ బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులను సాధారణ బస్సులో ఎక్కించారు. అప్పటికే బస్సు రద్దీగా ఉండడంతో షణ్ముగవేల్ ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణించాల్సి వచ్చింది. ఈ విషయమై ఆయన తిరునల్వేలి వినియోగదారుల ఫోరంలో దాఖలుచేసిన పిటిషన్ విచారించిన ఫోరం... రాష్ట్ర రవాణా సంస్థ సేవలు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బంది పడిన షణ్ముగవేల్‌కు రూ.50,000, పిటిషన్ ఖర్చులకు రూ.10,000 చెల్లించాలని, ఈ జరిమానా నెలరోజుల్లో ఇవ్వని పక్షంలో, 6.5 శాతం వడ్డీతో చెల్లించాలని ఉత్తర్వులు జారీచేసింది.

మత్తుబిళ్లలతో నేపాలీ యువకుల అరెస్ట్

ప్యారీస్, ఆగస్టు 30: స్థానిక అమింజికరైలో ఇద్దరు నేపాలీ యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి నుంచి 3,400 మత్తుబిళ్లలు స్వాధీనం చేసుకున్నారు. అమింజికరై, పరిసర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో మత్తుబిళ్లలు విక్రయం జోరుగా సాగుతోందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో తిరువిక పార్క్ సమీపంలో గురువారం సాయంత్రం మాటువేసిన పోలీసులు, అక్కడ ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా సంచరించడం గమనించి అదుపులోకి తీసుకొని విచారించారు. వారి నుంచి మత్తుబిళ్లలు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు నేపాల్‌కు చెందిన ప్రకాశ్, కృష్ణ శర్మ అని తెలిసింది.

సినీ ఫక్కీలో పారిపోయేందుకు ఇసుక స్మగ్లర్ ప్లాన్

● అరెస్టు చేసిన పోలీసులు

అడయార్, ఆగస్టు 30: సినీ ఫక్కీలో పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని పారిపోయేందుకు ప్లాన్ చేసిన ఓ ఇసుక స్మగ్లర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తన దగ్గరకు రాకుండా బట్టలన్నీ విప్పి నగ్నంగా నిల్చొన్నాడు. అయితే పోలీసులు మాత్రం వెనకాడకుండా ఆ స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. వివరాలిలా... తిరునెల్వేలి జిల్లాలోని నాంగునేరి, మూలక్కరై, విజయనారాయణం తదితర ప్రాంతాల్లో నీటి వనరులు అధికంగా ఉండటంతో ఇసుక అక్రమ రవాణా సాగుతుంది. దీనిపై అందిన ఫిర్యాదుల మేరకు రంగంలోకి దిగిన పోలీసులు.. ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతానికి వెళ్ళగా, వారిని చూసిన స్మగ్లర్ గంగై ఆదిత్యన్ ఎక్సకవేటర్, ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలిపెట్టి పారిపోయాడు. ఈయన ఇంటిలో ఉన్నట్టు సమాచారం రావడంతో విజయనారాయణం సీఐ నాగకుమారి నేతృత్వంలో పోలీసులు బృందం వెళ్ళగా, స్మగ్లర్ భార్య పోలీసులను ఇంటిలోకి రాకుండా అడ్డుకున్నారు. ఈ విషయాన్ని ఏఎస్పీ ప్రసన్న కుమార్‌కు చెప్పగా, ఆయన సంఘటనా స్థలానికి వచ్చి తలుపు బద్ధలుకొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. అయితే, పోలీసులు తన వద్దకు రాకుండా ఉండేందుకు గతంలో వచ్చిన 'తలైనగరం' చిత్రంలోని గంజాయి స్మగ్లర్ తరహాలో నగ్నంగా మారిపోయాడు. ఇలా చేస్తే పోలీసులు తన వద్దకు రారని భావించిన స్మగ్లర్‌కు పోలీసులు షాక్ ఇచ్చారు. దుస్తులు లేకుండా ఉన్న స్మగ్లర్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు.

ఎమ్మెల్యే ఇంటిముందు డీఎంకే నేత ఆత్మహత్య

ప్యారీస్, ఆగస్టు 30: గవర్నర్ ఆర్ఎన్ రవిని రీకాల్ చేయాలని కోరుతూ గురువారం మదురై డీఎంకే ఎమ్మెల్యే దళపతి ఇంటిముందు కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్న డీఎంకే నేత గణేశన్ (45) మరణించాడు. మదురై జిల్లా ఆవిన్ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు గణేశన్ జూన్ 28వ తేదీ మదురై సిమ్మకల్ ప్రాంతంలో గవర్నర్‌ను రీకాల్ చేయాలని కోరుతూ తన శరీరంపై కిరోసిన్ చల్లుకుని నిప్పంటించేందుకు ప్రయత్నించగా, పార్టీ శ్రేణులు రక్షించారు. ఈ నేపథ్యంలో మరోమారు ఆయన డీఎంకే ఎమ్మెల్యే ఇంటిముందు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రాణాలు కోల్పోయాడు. దీనిపై మదురై జిల్లా న్యాయమూర్తి బాధితుడి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

యూట్యూబ్‌లో పాపులర్ కావాలని... యువకుడి విచిత్ర వేషం



అస్థిపంజరం వేషంలో రోడ్డుపై యువకుడు

పెరంబూర్, ఆగస్టు 30: సేలం జిల్లా వాలప్పాడిలో, యూట్యూబ్‌లో పాపులర్ కావాలనుకున్న యువకుడు అస్థిపంజరం వేషంతో రద్దీ ప్రాంతంలో సంచరించడం కలకలం రేపింది. వాలప్పాడి బస్టాండ్‌లో శుక్రవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో, సేలంకు చెందిన ఓ యువకుడు నల్లరంగుతో కూడిన దుస్తులు, వాటిపై అస్థిపంజరం పెయింటింగ్ వేసి ప్రయాణికుల మధ్య తిరగడంతో ప్రయాణికులు బెంబేలెత్తారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

నేపాల్ వెళ్లేందుకు ఇద్దరు మైనర్ల యత్నం

● అదుపులోకి తీసుకున్న పోలీసులు

అడయార్, ఆగస్టు 30: స్థానిక ఈంజంబాక్కం ప్రాంతానికి చెందిన 13 యేళ్ళ బాలిక తన ప్రియుడైన 17 యేళ్ళ బాలుడితో నేపాల్ పారిపోయేందుకు ప్రయత్నించగా, నగర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు... చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన బాలిక తన అమ్మమ్మతో కలిసి ఉంటోంది. స్థానిక పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతూ కుటుంబ పోషణకై ఓ సూపర్ మార్కెట్‌లో పార్ట్ టైమ్ జాబ్ చేస్తోంది. అయితే, తన మనవరాలి భవిష్యత్ దృష్ట్యా అమ్మమ్మ మొబైల్ ఫోన్ వినియోగించరాదనే షరతు విధించింది. ఇలాంటి ఆంక్షల మధ్య జీవిస్తున్న ఆ బాలిక ఆ ప్రాంతానికి చెందిన 17 యేళ్ళ బాలుడిని ప్రేమించింది. అమ్మమ్మ ఆంక్షల మధ్య జీవించడం ఇష్టంలేని ఆ బాలిక తన ప్రియుడిని పెళ్ళి చేసుకుని ఎక్కడైనా నివసించాలని ప్లాన్ చేసింది. ఇందులో భాగంగా గురువారం స్కూల్‌కు వెళ్ళిన ఆ బాలిక సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె అమ్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. పాఠశాల సమీపంలోని సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించారు. ఇందులో ఓ యువకుడితో ఆ బాలిక గంటకుపైగా మాట్లాడినట్టు గుర్తించారు. ఆ తర్వాత మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా ఆ యువకుడు తిరువాన్మియూరులోని ఓ హాస్టల్‌లో ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అక్కడకు వెళ్ళిన పోలీసులకు.. ఆ బాలిక, బాలుడితో పాటు మరో యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. తన అమ్మమ్మ ఆంక్షల్లో జీవించలేక తన ప్రియుడిని పెళ్ళి చేసుకుని ఎక్కడికైనా వెళ్ళిపోవాలని నిర్ణయం తీసుకుని, ఇందుకోసం ప్రియుడి స్నేహితుడి ద్వారా నేపాల్‌కు వెళ్ళిపోయేందుకు ప్లాన్ వేసినట్టు బాలిక వివరించింది. దీంతో ఆ ప్రేమజంటతో పాటు వారిని రైలులో నేపాల్ పంపించేందుకు ముందుకు వచ్చిన మరో యువకుడిని కూడా అరెస్టు చేశారు.

తాంబరం-నాగర్‌కోయిల్ ప్రత్యేక రైళ్లు పొడిగింపు

ఐసిఎఫ్, ఆగస్టు 30: ప్రయాణికుల రద్దీ దృష్టిలో ఉంచుకొని తాంబరం-నాగర్‌కోయిల్ ప్రత్యేక రైళ్ల సేవలు నవంబరు వరకు పొడిగించినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. నాగర్‌కోయిల్ నుంచి ఆదివారం రాత్రి 11.15 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు మరుసటిరోజు ఉదయం 11.15 గంటలకు తాంబరం చేరుతుంది. ఈ రైలు సెప్టెంబరు 1, 8, 15, 22, 29, అక్టోబరు 6, 13, 20, 27, నవంబరు 3, 10, 17 ,24 తేదీల్లో పొడిగించారు. తాంబరం నుంచి సోమవారం సాయంత్రం 3.30 గంటలకు బయల్దేరే రైలు మరుసటిరోజు వేకువజామున 3.45 గంటలకు నాగర్‌కోయిల్ చేరనుంది. ఈ ప్రత్యేక రైలు సెప్టెంబరు 2, 9, 16, 23, 30, అక్టోబరు 7, 14, 21, 28, నవంబరు 4, 11, 18, 25 తేదీల వరు పొడిగించారు. **కొచ్చువెలి రైళ్ల రద్దు...:** నిర్వహణ కారణాల చేత చెన్నై సెంట్రల్-కొచ్చువెలి వారాంతపు ప్రత్యేక రైలు సేవలు రద్దు చేశారు. చెన్నై సెంట్రల్ నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు బయల్దేరే వారాంతపు ప్రత్యేక రైలు సెప్టెంబరు 4, 11, 18, 25 తేదీల్లో రద్దు కానుంది. కొచ్చువెల్లి నుంచి సాయంత్రం 6.25 గంటలకు బయల్దేరే వారాంతపు ప్రత్యేక రైలు సెప్టెంబరు 5, 12, 19, 26 తేదీల్లో రద్దు కానుంది.

‘విడుదలై-2’ విడుదల తేదీ ఖరారు

జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ దర్శకత్వంలో సూరి, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలు పోషించిన ‘విడుదలై’ రెండో భాగాన్ని డిసెంబరు 20న విడుదల చేయనున్నారు. గత యేడాది మార్చి 31వ తేదీ విడుదలైన ఈ చిత్రం తొలి భాగం బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెల్సిందే. ఇందులో సూరి, విజయ్ సేతుపతితో పాటు భవానీ శ్రీ, ప్రకాష్ రాజ్, గౌతం వాసుదేవ్ మేనన్, రాజీవ్ మేనన్, చేతన్ కీలక పాత్రలు పోషించారు. కెమెరా వేల్‌రాజ్, సంగీతం ఇళయరాజా. ప్రస్తుతం రెండోభాగం నిర్మాణ పనులు శరవేగంగా జరుపుకుంటుంది. ఈ నేపథ్యంలో డిసెంబరు 20వ తేదీ ఈ సినిమా విడుదల చేయనున్నట్టు ఓ పోస్టర్ ద్వారా అధికారికంగా వెల్లడించారు.


‘విడుదలై’లో విజయ్ సేతుపతి, మంజు వారియర్

రూ.100 కోట్ల క్లబ్‌లో ‘తంగలాన్’

చిత్రజ్యోతి

పా.రంజిత్ దర్శకత్వంలో చియాన్ విక్రమ్ హీరోగా నటించిన ‘తంగలాన్’ చిత్రం రూ.100 కోట్ల వసూళ్ళను రాబట్టింది. ప్రపంచ వ్యాప్తంగా తమిళం, తెలుగు తదితర భాషల్లో ఈ కలెక్షన్స్ రాబట్టినట్టు నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్, నీలం ప్రొడక్షన్స్ సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. బడా నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రంలో విక్రమ్, పార్వతి, మాళవిక మోహన్, పశుపతి, డేనియల్ కాల్టాడిరోన్ తదితరులు నటించారు. కోలార్ బంగారు గనుల నేపథ్యంలో అణగారిన ప్రజల వాస్తవి కతను, జీవన, హక్కుల పోరాటంపై ఈ సినిమా సాగుతుంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ మూవీ ఈ నెల 15వ తేదీన విడుదలైన విషయం తెల్సిందే. తొలి రోజునే ప్రపంచ వ్యాప్తంగా రూ.26 కోట్ల మేరకు వసూళ్ళను రాబట్టి.. చియాన్ విక్రమ్ సినీ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు రాబట్టిన చిత్రంగా నిలిచింది. ఇదిలావుంటే, ఈ సినిమా హిందీ వెర్షన్‌ను సెప్టెంబరు ఆరో తేదీన విడుదల చేయనున్నారు.


‘తంగలాన్’లో విక్రమ్

షిర్డీ వెళ్ళిన విజయ్

ప్యారీస్, ఆగస్టు 30: సినీ హీరో, తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు దళపతి విజయ్ షిర్డీ సందర్శించేందుకు శుక్రవారం నగరం నుంచి విమానంలో బయలుదేరి వెళ్ళారు. ఇటీవల తన పార్టీ జెండా ఆవిష్కరించడంతో పాటు పార్టీ తొలి మహానాడును సెప్టెంబరు 23వ తేదీన విల్లుపురం జిల్లా విక్రవాండిలో నిర్వహించనున్నట్టు ప్రకటించారు. తన తల్లి కోరిక మేరకు అంబత్తూరులో సాయినాథుని ఆలయాన్ని నిర్మించిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఆయన హఠాత్తుగా షిర్డీ బయలుదేరి వెళ్ళారు.


‘మైయల్’లో సేతు, సమృతి

‘మైనా’ ఫేం సేతు హీరోగా ‘మైయల్’

ఐకాన్ సినీ క్రియేషన్స్ ఎల్ఎల్‌పీ సమర్పణలో నిర్మాతలు ఆర్.వేణుగోపాల్, అనుపమ విక్రమ్ సింగ్ నిర్మాణంలో ఏపీజీ ఏళుమలై దర్శకత్వంలో ‘మైనా’ ఫేం సేతు హీరోగా నటించిన కొత్త చిత్రానికి ‘మైయల్’ అనే టైటిల్ ఖరారు చేశారు. చక్కటి కథలతో రూపొందే చిత్రాలు భాషా సరిహద్దులకు అతీతంగా ఆదరణ పొందుతున్నాయి. ఇటీవలి కాలంలో తమిళ చిత్రపరిశ్రమలో ఇలాంటి మంచి కంటెంట్ చిత్రాలకు విశేష ఆదరణ లభిస్తోంది. అలాంటి చిత్రాల్లో ఒకటి ‘మైనా’. ఇందులో భాస్కర్ పాత్రలో నటించిన సేతు.. ఇపుడు ఒక ముఖ్యమైన సామాజిక ఇతివృత్తంతో డీప్లీ ఎమోషనల్ మూవీగా తెరకెక్కిన ‘మైయల్’లో హీరోగా నటించారు. ఈ సినిమా గురించి దర్శకుడు ఏళుమలై మాట్లాడుతూ, ‘ఒక సాధారణమైన వ్యక్తి హక్కులు కాపాడేందుకు, అతనికి జీవితాన్ని ప్రసాదించేందుకు న్యాయ వ్యవస్థ తీసుకున్న ఒక నిర్ణయం కారణంగా నిజమైన ప్రేమ విచ్చిన్నమైపోతుంది. అది ఎలా అన్నదే ఈ చిత్ర కథ. హీరోయిన్‌గా కన్నడ నటి సమృతి నటించారు. ఈమె తొలిసారి కోలీవుడ్‌కు పరిచయమవుతున్నారు. ఈ సినిమా షూటింగ్‌ను 37 రోజుల్లో పూర్తి చేశాం. తిరువణ్ణామలై సమీపంలోని కల్వరాయన్ కొండ ప్రాంతంలోని అందమైన లొకేషన్‌లలో చిత్రీకరించాం. అని వివరించారు.

తరుణి

అత్యాధునిక ఆలోచనలు... నూతన వ్యాపార మార్గాలు

- ఇంటివద్దకే ‘స్టిచ్ కార్ట్’
- వినూత్న ప్రయోగంతో రాణిస్తున్న లావణ్య

శరవేగంగా పెరుగుతున్న నగరాల్లో దర్జీలు కూడా కనుమరుగైపోతున్నారు. అందరూ రెడీమేడ్ దుస్తుల వైపే ఆసక్తి చూపించడంతో టైలర్లకు కూడా ఆదరణ తగ్గుతోంది. ఎవరైనా తమకు నచ్చిన విధంగా దుస్తులు కుట్టించుకోవాలంటే సిటీలో వెతకాల్సిన పరిస్థితి. అయితే దీనికి పరిష్కారంగా ఆధునిక ఆలోచనలతో ముందుకు వచ్చారు క్రోంపేటకు చెందిన లావణ్య... స్టిచ్ కార్ట్ అనే మొబైల్ వాహనంలో ఇంటి దగ్గరకే వచ్చి కొలతలు తీసుకుని మీకు నచ్చిన విధంగా బట్టలు కుట్టి ఇస్తున్న లావణ్య జీవిత ప్రస్థానం నేటి తరుణిలో....

\- పెరంబూర్


‘స్టిచ్ కార్ట్’ వాహనంతో లావణ్య

“మనకు నచ్చిన విధంగా టైలర్లు దొరకడం అదృష్టం. చెన్నై లాంటి మహానగరంలో చాలా కష్టం. ఇక నుంచి ఆ కష్టాలు మీకుండవు. మేమే మీ ఇంటికి వెతుక్కుంటూ వస్తాము. మీ కొలతలు తీసుకొని, మెటీరియల్ తీసుకెళ్లి, ఒక వారంలో కుట్టు పనులు పూర్తిచేసి మళ్లీ మీ ఇంటి వద్దకే వచ్చి డెలివరీ చేస్తాము. మా ‘స్టిచ్ కార్ట్’ సంచార వ్యాన్‌లో ట్రయల్ రూమ్ కూడా ఉంది. అంటున్నారు ‘స్టిచ్ కార్ట్’ పేరిట సంచార టైలరింగ్ యూనిట్ నడుపుతున్న క్రోంపేటకు చెందిన లావణ్య.


సంచార వాహనంలో కుడుతూ..

అంకురార్పణ....

గత 45 ఏళ్లుగా ‘ఉమ టైలరింగ్ ఇనిస్టిట్యూట్ అనే పేరుతో తాంబరంలో లావణ్య అత్త ఉమావతి చేపట్టిన టైలరింగ్ కుటుంబ సభ్యుల సహకారంతో అప్‌డేట్ చేశారు.. ఒక్క మాటలో చెప్పాలంటే ‘ఇది ఒక డిజిటల్ వర్షన్’. ‘ఉమ టైలరింగ్ ఇన్‌స్టిట్యూట్’ పేరుతో ఇంట్లోనే టైలరింగ్ ప్రారంభించి చుట్టుపక్కల నివసించే మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. అనంతరం ఇన్‌స్టిట్యూట్ అభివృద్ధి చెందింది. తాంబరంలో సెటిల్ అయి, సొంతంగా ఓ ఇంటిని కొనుగోలు చేసి కింది అంతస్తులో టైలరింగ్ ఇన్‌స్టిట్యూట్, పైన నివాసం ఉండేవారు. ఈ నేపథ్యంలో ఉమావతి తన కోడలు లావణ్యకు టైలరింగ్ శిక్షణ ఇవ్వడంతో పాటు మిషన్ కూడా ఇచ్చారు.


డిజిటల్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభిస్తున్న ఉమావతి

వివాహ నేపథ్యం.....

కర్ణాటకకు చెందిన లావణ్య వివాహనంతరం చెన్నై వచ్చారు. భర్త సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్నారు. ఎంఏ ఇంగ్లీషు లిటరేచర్ పూర్తిచేసిన లావణ్యకు చిన్నతనం నుంచే ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ రంగాలపై ఆసక్తి ఉండేది. వివాహం అయిన తరువాత అత్త దగ్గర ఎంబ్రాయిడరీ, టైలరింగ్ వంటివి నేర్చుకుంది. తన తదనంతరం ఈ బాధ్యతలు ఎవరు చేపడతారనే ఆలోచనలో ఉన్న ఉమావతి తన కోడలు ద్వారా తీరాయంటూ చెబుతుంటారు. కరోనా లాక్‌డౌన్‌తో ఏం చేయాలని ఆలోచించిన లావణ్య భర్త సుందరరాజన్, అతడి స్నేహితులతో కలసి మొబైల్ యాప్ రూపొందించి దానికి ‘స్టిచ్ కార్ట్’ అనే పేరు పెట్టారు. మహిళలకు అవసరమైన డిజైన్లు ఎంపిక చేసి, అందులోని చిరునామా ద్వారా వారికి పంపేలా ఈ యాప్ రూపొందించారు. డిజైనర్‌తో జూమ్ కాలింగ్‌లో వినియోగదారులతో మాట్లాడి, వారిష్టాలు తెలుసుకొని, దుస్తులు రూపొందించి డోర్ డెలివరీ చేసే సదుపాయం తీసుకువచ్చారు. మహిళల దుస్తులు, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల దుస్తులు, వెస్ట్రన్ ఔట్ ఫిట్ డ్రస్ తదితరాలు ఈ యాప్ ద్వారా ఆర్డర్లు పొంది, డోర్ డెలివరీ చేయడం ప్రారంభించారు. కరోనా లాక్ డౌన్ కారణంగా అన్ని రంగాలు స్తంభించిన నేపథ్యంలో, ఈ యాప్ ఆమెకు ఎంతో ఉపయోగపడింది. లాక్‌డౌన్ తర్వాత కూడా ఈ యాప్ ద్వారానే వినియోగదారులు ఆర్డర్లు చేస్తున్నారు.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇతర యాప్‌ల మాదిరిగానే ‘స్టిచ్ కార్ట్’ యాప్ కూడా పనిచేస్తుంది. అయితే వారు తయారు చేసే దుస్తుల్లో చిన్నపాటి లోపాలను డెలివరీ చేసిన తరువాత బయటపడేది. మళ్లీ వాటిని తీసుకొచ్చి సరిచేసి ఇచ్చేందుకు మరికొంత సమయం పట్టేది. దీనిని నివారిస్తూ వినియోగదారులకు నిర్ణీత సమయంలోనే సేవలందించేందుకు రూపొందించిందే ‘స్టిచ్ కార్ట్’. ఓ వ్యాన్‌లో ట్రయల్ రూమ్‌తో పాటు ఒక మెషిన్ కూడా ఉంటుంది. దుస్తులు డెలివరీ చేసిన సమయంలో, వినియోగదారులు ట్రయల్ రూంలో వేసి చూసుకోవచ్చు. వాటిలో ఉన్న లోపాలను సరిచేసి వెంటనే అందించే వీలుంటుంది.


యంగ్ టాలెంట్స్‌తో ....

‘ఫిట్...ఫ్యాషన్ విత్ క్వాలిటీ’ అనేదే తమ ఉన్నతికి తారక మంత్రం అంటున్నారు లావణ్య. తనతో పనిచేస్తున్న వారంతా వృత్తినైపుణ్యం కలిగిన వారు. ఫ్యాషన్ డిజైనింగ్‌లో ముగ్గురు ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులు. ఎలాంటి డిజైన్ చేయాలి, ఎలా రూపొందించాలి అనే విషయాల్లో చాలా యాక్టివ్‌గా ఉంటారు. స్టిచ్ కార్ట్ వాహనాన్ని అపార్ట్‌మెంట్స్, విల్లా తదితర ప్రాంతాలవారే అధికంగా కోరుతుంటారు. తాంబరం యూనిట్‌లో 10 మంది టైలర్లు, నలుగురు మాస్టర్లు పనిచేస్తున్నారు. ఈ యూనిట్‌ను లావణ్య అత్త ఉమావతి చూసుకుంటారు. క్రోంపేటలోని యూనిట్ పూర్తిగా డిజిటల్.తాంబరం యూనిట్ నుంచి 7 కి.మీ పరిసర ప్రాంతాలకు స్టిచ్ కార్ట్ ద్వారా సేవలు అందిస్తున్నారు.

చెన్నై నగరం అంతా ఈ సేవలు విస్తరించాలని ఆలోచన ఉంది. దానికోసం ఎక్కువ మంది యంగ్ టాలెంట్స్ అవసరం కూడా ఉంది. ఫ్యాషన్ రంగంపై ఆసక్తి ఉన్న వారికి ఫ్రాంచైజ్ ఇచ్చే ఆలోచనలో కూడా ఉన్నాము. ఈ వృత్తిలో మాతో పాటు పలువురు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కూడా మాకు సంతృప్తినిస్తోందని తరుణితో తన మనోభావాలను పంచుకున్నారు లావణ్య.


కుంభాభిషేక వేడుకలను వివిధ అధీనాలతో కలిసి తిలకిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

వైభవంగా విరాటేశ్వరాలయ మహాసంప్రోక్షణ

చెన్నై, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మైలాడుదురై విరాటేశ్వరాలయ మహా సంప్రోక్షణ శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. దీంతో ఆ శాఖ గత మూడేళ్లలో నిర్వహించిన ఆలయాల కుంభాభిషేకాల సంఖ్య 2వేలకు చేరింది. ఈ వేడుకల్లో దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ఆ శాఖ కమిషనర్ పీఎస్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ మహాభారతి, ఎంపీ సుధా, శాసనసభ్యుడు నివేదా మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మణిద్వీప వర్ణన పూజ


మణిద్వీప వర్ణన పూజలు నిర్వహిస్తున్న హరికుమార్-కిరణ్‌కుమారి తదితరులు

ప్యారీస్, ఆగస్టు 30: శ్రావణ శుక్రవారం సందర్భంగా లోకకల్యాణార్థం లలితా మణిద్వీప వర్ణన పూజలను నగరంలో వైభవంగా నిర్వహించారు. షావుకారుపేటలోని వాసవి మినీ హాల్‌లో వాసవి బిల్డర్స్ అండ్ ప్రమోటర్స్ అధినేత హరికుమార్-కిరణ్‌కుమారి దంపతుల పర్యవేక్షణలో వేదికపై లలిత అమ్మవారి విగ్రహాన్ని కొలువుదీర్చి అలంకరించారు. 9 రకాల పూలు, పత్రాలు, పండ్లు, నవధాన్యాలు నైవేద్యంగా సమర్పించారు. 9 మంది ముత్తైదువులు కూర్చొని 9 సార్లు లలితా సహస్ర నామ పారాయణం చేసి పూజలు నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ పూజల్లో పాల్గొన్న ముత్తయిదువులకు పాదపూజ చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, డీఎంకే ప్రముఖులు ఎస్.మురళి, ఎస్.రాజశేఖర్, కేఆర్ అపరంజి, అన్నామలై, టీఎస్ శేఖర్, ఎస్.వెంకటేశన్, సి.గాంధీ, అన్నాదానస్, వావిచర్ల సత్యనారాయణ, బాలమురుగన్, డా.ప్రత్యూష సహా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కులశేఖరపట్టినంలో దసరా ఏర్పాట్లు

- మాలధారణ ప్రారంభించిన భక్తులు


భక్తులకు మాల వేస్తున్న అర్చకులు


దీక్ష ప్రారంభించి అమ్మవారిని దర్శిస్తున్న భక్తులు


చెన్నై, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లాలోని కులశేఖరపట్టినం ముత్తారమ్మన్ ఆలయంలో దసరా వేడుకలకు ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు.భారతదేశంలో మైసూరు తర్వాత భారీ స్థాయిలో దసరా వేడుకలు ముత్తారమ్మన్ ఆలయంలోనే జరుగుతాయి. ఈ వేడుకలకు దేశవిదేశాల నుంచి భక్తులు వస్తారు. చెన్నై, కోవై, కన్నియాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాలకు చెందిన భక్తులు దసరా వేడుకల్లో కాళికాదేవి, అమ్మవారు, పరమేశ్వరుడు, శ్రీకృష్ణుడు, మురుగప్పెరుమాన్, వినాయకుడు తదితర దేవతామూర్తులు వేషాలు ధరించి సందడి చేస్తారు. ఇదే విధంగా కురవన్, కురత్తి, పోలీసు, వానరం, ఎలుగుబంటి, సింహం, పులి వేషాలు ధరించి వేడుకల ఊరేగింపుల్లో పాల్గొంటారు. ఈ ఆలయంలో 90 రోజులు, 48 రోజులు, 31 రోజులు, 12 రోజులు, 10 రోజులు చొప్పున భక్తులు వ్రతమాచరించటం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఈ యేడాది దసరా ఉత్సవాల నేపథ్యంలో భక్తుల 48 రోజుల దీక్ష శుక్రవారం ప్రారంభమైంది. కులశేఖరపట్టినం సముద్రతీరంలో స్నానమాచరించి, ఎరుపు వస్త్రాలు, తులసిమాలలు ధరించి ఆలయంలో అమ్మవారిని దర్శించిన తరువాత ప్రధానార్చకులు వారితో మాలాధారణ చేయించారు. ఈ యేడాది దసరా వేడుకలు అక్టోబర్ 3న ధ్వజారోహణంతో ప్రారంభవుతాయని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. కీలకఘట్టమైన శూరసంహారం అక్టోబర్ 12న జరుగుతుంది. ఈ వేడుకలకు వాహనాల్లో వచ్చే భక్తులకోసం కులశేఖరపట్టినం బైపాస్‌రోడ్డు, ఉడన్‌కుడి రోడ్డు, మణప్పాడు రోడ్డు, తిరుచెందూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నారు. ఈ వేడుకలు పూర్తయ్యేంతవరకూ ఆలయ పరిసరాలలో భక్తుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

వీఐటీలో వ్యవసాయ ఉత్పత్తుల ఎగ్జిబిషన్ ప్రారంభం

వేలూరు, ఆగస్టు 30: స్థానిక కాట్పాడిలోని వీఐటీ యూనివర్శిటీలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి వర్శిటీ ఉపాధ్యక్షులు సెల్వం అధ్యక్షత వహించగా, కలెక్టర్ సుబ్బులక్ష్మి, తిరువళ్లువర్ యూనివర్సిటీ వీసీ ఆర్ముగం ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రదర్శన ప్రారంభించారు. ఇందులో వేలూరు, తిరుపత్తూర్, రాణిపేట, తిరువణ్ణామలై జిల్లాలకు చెందిన సుమారు 5 వేల మంది రైతులు పాల్గొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో 130 స్టాల్స్ ఏర్పాటుచేయగా, ఆదివారం వరకు ఎగ్జిబిషన్ జరుగనుంది. పారంపర్య బియ్యం, విత్తనాల రకాలు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, ఎరువుల తయారీ, ఉద్యానవన పంటల సాగు తదితరాలతో స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, సాగులో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందేలా రైతులు కృషిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య తదితర శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులకు కలెక్టర్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షుడు సెల్వం తదితరులు - ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్


చెన్నైలో అనారోగ్యంతో మృతిచెందిన సమాచారశాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.మణిమారన్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర యువజన సంక్షేమ శాఖ మంత్రి ఉదయనిధి



చెన్నై క్రిస్టియన్ మహిళా కళాశాలలో ‘మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ఫలితాలపై అవగాహన, ముందు జాగ్రత్త చర్యల’పై శుక్రవారం జరిగిన సదస్సులో మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి


చెన్నై మెరీనాతీరంలో శనివారం జరుగనున్న ఫార్ములా రేస్‌లో పాల్గొనే కార్ల వద్ద సెల్ఫీ తీసుకుంటున్న ప్రజలు



శుక్రవారం ఢిల్లీలో ‘టాప్ ర్యాంకర్స్ ఎక్సలెన్స్ అవార్డ్ ఫర్ విజనరీ లీడర్‌షిప్’ను రైల్వేబోర్డు మాజీ చైర్మన్, ఎయిరిండియా మాజీ సీఈవో అశ్వనిలోహనీ నుంచి స్వీకరిస్తున్న ‘నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్’ (ఎన్ఎల్‌సీ) సీఎండీ ప్రసన్నకుమార్ మోటుపల్లి. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ చైర్మన్ వీఎం.బన్సల్, ‘టాప్ ర్యాంకర్స్ మేనేజ్‌మెంట్ క్లబ్’ అధ్యక్షులు వీఎస్‌కే సూద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీ అరుణ్‌ను కలిసిన సంతోష్ రస్తోగి



అడయార్, ఆగస్టు 30: నగర పోలీస్ కమిషనర్ అరుణ్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దక్షిణ ప్రాంతీయ సంచాలకులు సంతోష్ రస్తోగి గురువారం మర్యాపూర్వకంగా కలుసుకున్నారు. ఆ సమయంలో వీరిద్దరూ కీలక సమాచారం మార్పిడి అంశంపై చర్చించినట్టు సమాచారం. వేప్పేరిలోని పోలీస్ కమిషనర్ ప్రధాన కార్యాలయంలో వీరిద్దరి సమావేశం జరిగింది. మున్ముందు రెండు విభాగాలు కలిసి పనిచేయాలని, సుహృద్భావ వాతావరణంలో సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవాలని వారిద్దరూ నిర్ణయించారు. ఆ సమయంలో పలువురు నగర పోలీస్ ఉన్నతాధికారులున్నారు.

విజయవంతంగా ముగిసిన సీఐఐ-తమిళనాడు సదస్సు



అడయార్, ఆగస్టు 30: భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తమిళనాడు చాప్టర్ నిర్వహించిన స్టార్టప్ సమ్మిట్ 2024 విజయవంతంగా ముగిసింది. రాష్ట్ర ఆర్థిక రంగం ట్రిలియన్ డాలర్లకు చేరుకునేందుకు వీలుగా దోహదం చేసే అనేక అంశాలపై ఇందులో చర్చించారు. దాదాపు 200కు పైగా స్టార్టప్‌లకు చెందిన ప్రతినిధులు కీలక భూమిక పోషించారు. ఇందులో సీఐఐ నేషనల్ స్టార్టప్ కౌన్సిల్ కో చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ సీకే రంగనాథన్, వీల్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఐఐ తమిళనాడు స్టేట్ కౌన్సిల్ చైర్మన్ శ్రీవత్స్ రామ్, స్టార్టప్ ప్యానెల్ కన్వీనర్ కార్తీక్ జయరామన్, ఐటీఎన్‌టీ హబ్ సీఈవో వనిత వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.